## క్లుప్తంగా

### 10 మందిపై కేసు నమోదు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో గ్రానైట్ దుకాణదారుడు అశోక్‌పై దాడి చేసినందుకు గ్రానైట్ వ్యాపారులు పది మందిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ నరసింహరాజు ఆదివారం తెలిపారు. గ్రానైట్ బండలు తక్కువ ధరకే అమ్ముతున్నాడని ఎమ్మిగనూరు రోడ్డులోని గ్రానైట్ దుకాణ యజమాని అశోక్‌పై వ్యాపారులు వడ్డె మల్లి, మార్కండేయ, ఆసిఫ్, హుసేన్, మురళితో పాటు మరో ఐదుగురు దాడి చేశారన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని తిరుమలనగర్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైకుపై వస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు ట్రాఫిక్ పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన జిలానీబాషా, ఆయన కుమార్తె, కుమారుడు ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామంలో పెళ్లి చూసుకొని తిరుగు ప్రయాణంలో ఆదోని వైపు వస్తుండగా పట్టణ శివారు తిరుమలనగర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

### తొగట వీర సంఘం మండలాధ్యక్షుడి ఏకగ్రీవం

కోసిగి: తొగట వీర క్షత్రీయుల సంఘం అధ్యక్షుడిగా ఓంప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక కడపాళెం వీధి చౌడేశ్వరి దేవి ఆలయంలో తొగట వీరక్షత్రీయుల సమావేశం నిర్వహించారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఓంప్రకాష్ రెండు నెలల క్రితం రాజీనామా చేశారు. మరోసారి మండల కుల బాంధవుల ఏకగ్రీవం మేరకు ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొంపల్లి చంద్రయ్య, బావిగడ్డ వెంకటేశులు, జనరల్ కార్యదర్శి తొవి రామచంద్ర, సహాయ కార్యదర్శులు ముదగల్లు రాజు, డాక్టర్ గోపాల్, బొంపల్లి విజయ్, ట్రెజరర్ హాల్వి వీరేష్, సబ్ ట్రెజరర్ బండారి రంగస్వామి ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మేరకు మండలాధ్యక్షుడు ఓంప్రకాష్‌ను ఆలయ అర్చకులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

### కేంద్ర మంత్రికి వినతి


కేంద్ర మంత్రి మీనాక్షి లేఖికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

ఆదోనిఅర్బన్: విజయవాడలో జరిగిన బీజేపీ సోషల్ మీడియా వలంటీర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ మంత్రి మీనాక్షి లేఖిని బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ కలిశారు. ఆదోనిలో పురావస్తు శాఖకు సంబంధించిన పురాతన కట్టడాలు, స్థలాల దుర్వినియోగం, కబ్జాలపై వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆదోని పరిసరాల్లో రాజకోటలు, సరస్సులు వంటి పురాతన కట్టడాలు అనేకం ఉన్నాయని, వాటిని ఒక వర్గం వారు ప్రార్థనా స్థలాలుగా, నాశనం చేసేవిధంగా ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిపై విచారణ కమిటీని నియమించి పురాతన సంపదను కాపాడాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు.

### శరవేగంగా సచివాలయ నిర్మాణం


కోసిగిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

కోసిగి: మండల కేంద్రంలో కోసిగి–3 సచివాలయ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి అన్ని సేవలు స్థానికంగానే అందించేలా చర్యలు చేపట్టింది. ఈ మేరకు సచివాలయ భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇదివరకే కోసిగి–4, పెద్దభూంపల్లి భవన నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక్కో భవనానికి రూ.40 లక్షలు నిధులు కేటాయించి పనులు చేపడుతున్నారు. పనులు వేగవంతంగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

### ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలో సర్పంచ్ రామాంజనేయులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఆదివారం గ్రామంలో పంచాయతీ సిబ్బందితో డ్రయినేజీ కాల్వల్లో పూడిక తొలగింపు పనులను దగ్గరుండి చేయించారు. అలాగే కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# ఇక్కడ భారం.. అక్కడ సౌకర్యం

- ఆదోని యార్డులో వేరుశనగ రైతులకు తిప్పలు
- టెండర్ ఫారం ఇచ్చినా ఆలస్యంగా ఖాళీ సంచుల అందజేత
- పాసింగ్ పేరుతో కొనుగోలుదారుల వేధింపులు
- ఖుషీ పేరుతో కూలీలు, హమాలీల దోపిడీ
- దిగుబడులను ఎమ్మిగనూరుకు తరలిస్తున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు


వేరుశనగ దిగుబడులు లేక బోసిపోతున్న ఆదోని మార్కెట్ యార్డు

ఆదోనిఅర్బన్: వ్యాపారులు, కూలీలు, హమాలీల తీరుతో ఆదోని మార్కెట్ యార్డుకు రైతులు దిగుబడులు తీసుకొచ్చేందుకు జంకుతున్నారు. గతంలో యార్డుకు ఈ సీజన్‌లో రోజూ 25 వేల నుంచి 35 వేల సంచుల వరకు వేరుశనగ దిగుబడులు వస్తుండేవి. ప్రస్తుతం 100 నుంచి 300 సంచులకే పరిమితమయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొనుగోలదారులు పాసింగ్ పేరుతో వేధింపులు, టెండర్ ఫాం పూర్తయినా ఖాళీ సంచులు తొందరగా ఇవ్వకపోవడం ఒక ఎత్తు అయితే, కూలీలు, హమాలీలు, దుకాణాలకు నీరు వేసే వారికి ఖుషీ పేరుతో 20 కేజీల వరకు అదనంగా ఇచ్చుకోవాల్సిందే. దీంతో పాటు యార్డులోనే రాత్రి వరకు రైతులు పడిగాపులు గాయాల్సిందే. వీటికి భిన్నంగా రైతులకు అనుకూలంగా వ్యవహరిస్తుండడం, ఒక్కరోజులోనే విక్రయించుకుని వెళ్తుండడంతో ప్రతి ఆదివారం ఎమ్మిగనూరు యార్డుకు 20 వేలకు పైగా వేరుశనగ సంచులు పోటెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

వ్యవసాయ దిగుబడుల క్రయ, విక్రయాలకు ఎంతో ఖ్యాతిగాంచిన ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు రోజురోజుకు ప్రాభవం కోల్పోతోంది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు కష్టనష్టాలు తప్పడం లేదు. యార్డులో వేరుశనగ దిగుబడులు ఉదయం 8 గంటలకు ఎండకు పోస్తారు. సాయంత్రం 4.30 గంటల వరకు కాటా వేయడం లేదు. ఎండకు ఎండి తూకం తగ్గాలనే ఆలోచనతో వ్యాపారులు దిగుబడులను నింపేందుకు ఖాళీ సంచులను ఆలస్యంగా ఇస్తున్నారు. ఇక పాసింగ్ పేరుతో వంకలు పెడుతున్నారు. వ్యాపారుల తీరుతో రైతులు స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు చీకటి పడడంతో రవాణా సౌకర్యాలు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే హమాలీలు ఖుషీ పేరుతో పది కేజీల వేరుశనగకాయలను బలవంతంగా తీసుకుంటున్నారు. మహిళా కూలీలు కూడా తమకు వేరుగా ఇవ్వాల్సిందేనని దాదాపు 8 కేజీల వరకు తీసుకుంటున్నారు. చివరకు మంచినీరు ఇచ్చేవారు. తమకు ఇవ్వరా అంటూ ఐదు కేజీల వరకు దండుకుంటున్నారు. ఇలా మొత్తం 20 కేజీల వరకు రైతులు నష్టపోతున్నారు. వారి తీరు నచ్చక 80 శాతం మంది రైతులు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుకు దిగుబడులను తరలిస్తున్నారు.

**ఎమ్మిగనూరు యార్డులో ఇలా..**

ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో ఉదయం 8:30 గంటలకు వేరుశనగ దిగుబడులను ఆరబోస్తే టెండర్ ఫారం వచ్చిన వెంటనే కాటా వేసి సంచులను నింపేస్తారు. పాసింగ్ పేరుతో వేధింపులు ఉండవు. గింజల్లో రాళ్లు, రప్పలు, ఇసుక ఉన్నా వ్యాపారులు టెండర్ వేసేటప్పుడే జాగ్రత్త పడి ధర వేస్తారు. సాయంత్రం 5 గంటల కల్లా రైతులు వేరుశనగ దిగుబడులను అమ్ముకుని మొత్తాన్ని తీసుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఖుషీ పేరుతో దోపిడీ ఉండదు. దీంతో ఎమ్మిగనూరు యార్డుకు వేరుశనగ దిగుబడులు పెరుగుతున్నాయి.

**ఎమ్మిగనూరుకు వ్యాపారులు**

ఆదోని యార్డుకు వేరుశనగల దిగుబడులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఇక్కడి వ్యాపారులు ఎమ్మిగనూరుకు వెళ్లి కొని తీసుకొస్తున్నారు. ఆదోని యార్డులో కొనుగోలు చేస్తే నేరుగా దిగుబడులు ఫ్యాక్టరీలకు వెళ్తాయి. అయితే ఎమ్మిగనూరుకు వెళ్లి సరుకు కొనుగోలు చేయడంతో అక్కడి నుంచి ఆదోనికి లారీ బాడుగ, వీరి ఖర్చులు, అక్కడున్న వారికి కమీషన్ అందజేయాల్సి ఉంటుంది. అంతేగాకుండా వేరుశనగ సంచులు ఎత్తేటప్పుడు పడిపోవడం వల్ల తూకాలు తక్కువ రావడం వల్ల వారికి నష్టం వస్తుంది. అయినా వారి తీరు మారడం లేదు. ఎందుకంటే అక్కడి యార్డు అధికారులు, కమీషన్ ఏజెంట్లు రైతుల పక్షాన ఉండడంతో పాటు వారికి ఎలాంటి నష్టం కలిగించకుండా చూసే బాధ్యత వారికి ఉంది.

**నివారణ చర్యలు ఇలా..**

ఆదోని మార్కెట్ యార్డుకు గత వారం నుంచి రోజుకు 100 నుంచి 300 సంచులు వస్తున్నాయి. ఎమ్మిగనూరు యార్డుకు ఈ సీజన్‌లో రోజుకు వెయ్యి నుంచి 2 వేల సంచులు వస్తుండడంతోపాటు ప్రతి ఆదివారం 20 వేలకు పైగా సంచుల వేరుశనగ దిగుబడుల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. యార్డుకు ఆదాయం, రైతులు నష్టపోకుండా త్వరగా స్వగ్రామానికి వెళ్లే చర్యలు చేపట్టడం, అధికారుల చేతుల్లోనే ఉందని, కమీషన్ ఏజెంట్లు పేర్కొంటున్నారు. టెండర్ అయిన వెంటనే ఖాళీ సంచులు ఇవ్వాలని, పాసింగ్ బదులుగా ముందుగానే గిట్టుబాటు ధర టెండర్ వేసుకునేలా చర్యలు తీసుకోవాలి. అలాగే మారిన పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పిస్తే యార్డు ఆదాయం పూర్వపు స్థితికి చేరుకునే అవకాశం ఉంటుంది.

### కమీషన్ ఏజెంట్లలో మార్పు రావాలి



ఆదోని మార్కెట్ యార్డులోని కమీషన్ ఏజెంట్లలో మార్పు రావాలి. రైతులకు మోసం జరగకుండా వారి పక్షాన ఉంటూ వ్యాపారస్తులను నిలదీసేతనం రావాలి. అంతేగాకుండా వ్యాపారస్తులకు కూడా ఖాళీ సంచులు త్వరగా ఇవ్వాలని, పాసింగ్ చేయకూడదని, ముందుగానే గిట్టుబాటు ధర వేసుకోవాలని చెబుతున్నాం. యార్డు ఆదాయానికి గండి పడితే చర్యలు తీసుకుంటాం. యార్డుకు సరిగా వేరుశనగ దిగుబడులు రాకపోవడం తెలుసుకుని వ్యాపారస్తులను హెచ్చరించాం. ప్రస్తుతం ఈ సమస్యపై గట్టి చర్యలు చేపడతాం.

– రామ్మోహన్ రెడ్డి, ఆదోని మార్కెట్ యార్డు సెక్రటరీ

### వ్యాపారస్తులది దుర్మార్గమైన చర్య



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ దిగుబడుల క్రయవిక్రయాల్లో వ్యాపారస్తులు చేస్తున్నది దుర్మార్గమైన చర్య. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలి. పాసింగ్, ఆలస్యంగా ఖాళీ సంచులు ఇవ్వడం, ఖుషీ పేరుతో దోపిడీ చేయడాన్ని అరికట్టాలి. సమస్యను సరి చేసుకుంటే వ్యాపారులు, రైతులకు, ఆదోని యార్డుకు ఆదాయం చేకూరుతుంది. ఈ సమస్యపై త్వరలో ఆందోళనలు చేపడతాం.

– వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

## నేటి వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోని సెంట్రల్: కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే వైద్య శిబిరాలకు ఎప్పుడు రావాలో తెలియజేస్తూ టోకెన్లను అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఏయే వ్యాధులకు ఆరోగ్య శ్రీ వర్తిస్తుందో కార్డును ఎలా ఉపయోగించుకోవాలో వంటి అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్యం అందిస్తామని అధికారులు తెలిపారు.

నేటి వైద్య శిబిరాల వివరాలు

| మండలం | గ్రామం | ప్రదేశం | డాక్టర్ |
|---|---|---|---|
| ఆదోని | మదిరె–2 | గ్రామ సచివాలయం | ఎస్.న్యూటన్ |
| కౌతాళం | బాపురం | గ్రామ సచివాలయం | ఎస్.ప్రవీణ్‌కుమార్ |
| మంత్రాలయం | బసాపురం | గ్రామ సచివాలయం | జి.సురేష్ |

## 'జయహో చంద్రయాన్– 3' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 41వ పుస్తకం 'జయహో చంద్రయాన్ – 3' బాలగేయాల సంపుటి పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్వాల సోమన్న మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఏఎస్.రావ్ నగర్‌లోని కినరా గ్రాండ్ హోటల్‌లో విశ్రాంత ఫారెస్ట్ అధికారి ఏఎల్.కృష్ణారెడ్డి, విశ్రాంత భూగర్భ శాఖ డైరెక్టర్ డాక్టర్ వి.డి. రాజగోపాల్, గంటా మనోహర్‌రెడ్డి, విశ్రాంత వాణిజ్య పన్నుల శాఖ అధికారి గందె సోమశంకర్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. బాలసాహిత్యంలో సోమన్న అందించిన సేవలను అతిథులు కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. కవులు, ఉపాధ్యాయులు, కళాకారులు డి.కేశవయ్య, ఆరెకటిక నాగేశ్వరరావు, రవీంద్రబాబు, శ్రీపాద శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరానికి స్పందన


మదిరె గ్రామంలో జీవాలకు టీకాలు వేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని మదిరె గ్రామంలో ఆదివారం రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థల ఆధ్వర్యంలో సర్పంచ్ రంగస్వామి అధ్యక్షతన ఉచిత పశువుల వైద్య శిబిరం నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థ సభ్యుడు సవారయ్య మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలని, పశు పోషణపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పశువులు, గొర్రెలకు కాలనుగుణ వ్యాధులైన చర్మ, గాలికుంటు, జలుబు, దబ్బా రోగం, లివర్కు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వాటి నివారణకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పశు వైద్యాధికారి జగదీష్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేసి ఉచితంగా మందులు అందించారు. ఎంపీటీసీ మూకన్న, పాడి రైతులు పాల్గొన్నారు.

## 'మభ్య పెట్టి పార్టీ మార్పించారు'


అబ్దుల్ హజీజ్

పెద్దకడబూరు: తనను మభ్య పెట్టి కర్నూలుకు తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండలాధ్యక్ష పదవి కట్టబెట్టారని దయ్యాల అబ్దుల్ హజీజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఎంతో బాగుందన్నారు. తాను ముందునుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తగానే పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పని చేస్తుండడం గమనించి కొందరు కాంగ్రెస్ నాయకులు కర్నూలులో పని ఉందని చెప్పి తీసుకెళ్లి ఆ పార్టీ కండువా కప్పి మైనార్టీ మండలాధ్యక్షుడిగా నియమించామని చెప్పారన్నారు. తనకు తెలియకుండానే మోసం చేసి పార్టీలో చేర్చుకున్నారని మండిపడ్డారు. తనకు ఆ పదవిలో కొనసాగడం ఏమాత్రం ఇష్టం లేదని, వెంటనే రాజీనామా చేసినట్లు తెలిపారు. తాను వైఎస్సార్‌సీపీ కార్యకర్తగానే పనిచేస్తానని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

## ఆదర్శమూర్తి పీఎస్ మూర్తి కన్నుమూత


పీఎస్.మూర్తి (ఫైల్)

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు పీఎస్.మూర్తి (86) ఆదివారం మృతి చెందాడు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పని చేసి పదవీ విరమణ పొందారు. అధ్యాపకుడిగా పనిచేస్తున్న సమయంలో స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడిచేలా 1982లో వివేకానంద చారిటబుల్ ట్రస్టును స్థాపించాడు. ఎంతో మంది పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు చేయుతనిస్తూ చదివించాడు. ఆయన నుంచి సాయం పొందిన పలువురు నేడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అలాగే చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు అందించేవారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.

## కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్ఐ వరప్రసాద్, సిబ్బంది

ఆస్పరి: ఆస్పరి నుంచి నల్లగుట్టయ్య స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఆదివారం రూ.1.50 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఎస్ఐ చెప్పిన వివరాల మేరకు.. హొళగుందకు చెందిన నాగరాజుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు బొలెరో వాహనంలో 32 బాక్సుల్లో 3072 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను గొనెగండ్ల మండలం బీ.అగ్రహారం గ్రామానికి తీసుకెళ్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. బొలెరో వాహనాన్ని సీజ్ చేసి నిందితుడు నాగరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ చెప్పారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని చెప్పారు.

## దేవాలయానికి స్థలం విరాళం

మద్దికెర: మండలపరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన ఈడిగ రంగస్వామి అనే భక్తుడు రెండున్నర సెంట్ల స్థలాన్ని విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ఆదివారం ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని వారు కోరారు. సభ్యులు లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


మైనార్టీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబియాపర్వీన్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: ముస్లింల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో మైనార్టీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్‌అహ్మద్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబియాపర్వీన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ జి.జి.మనోహర్, డీఈ ఎజాజ్‌బాషా, స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదోనిలో ముస్లింలు 30 శాతానికి పైగా ఉన్నారని, వారి అభ్యున్నతికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. మైనార్టీ జూనియర్ కళాశాల ఏర్పాటుకు రూ.1.80 కోట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మైనార్టీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్‌అహ్మద్‌ను కోరారు. అలాగే సద్భావన మండపం నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయాలని, ఆరేకల్ వద్ద నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో మౌలిక వసతులు, సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు. అలాగే ఐటీఐ కళాశాల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు. షాదిఖానా నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయాలన్నారు. రూ.2.6 కోట్లతో ఉర్దూ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఆరేకల్ వద్ద మైనార్టీ రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి త్వరలోనే భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, కార్యక్రమానికి హాజరుకావాలని ఇంతియాజ్‌అహ్మద్‌ను కోరారు.

**ఆదోనిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం**

పట్టణంలోని ముస్లిం, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి, నవరత్నాల పథకాలు ప్రతి ఇంటికీ చేర్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని మైనార్టీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్‌అహ్మద్ తెలిపారు. ప్రధానంగా రెవెన్యూ విభాగంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ లక్ష్మినారాయణ, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారులు, స్థానిక నాయకులు రహమాన్, మస్తాన్, కార్పొరేషన్ నాయకులు అన్ను, సయ్యద్, అమాన్, ఇస్మాయిల్, రాంపురం ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి బాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అందించిన సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ నెల 10వ తేదీ నుంచి రెండు రోజుల పాటు మండల పరిధిలోని బాపురం గ్రామంలో చేపట్టనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. అలాగే 12న డంబలదిన్నె గ్రామంలో, 13న వీరాలదిన్నె గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరైతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## పద్మశాలీలు ఆర్థికంగా బలోపేతం కావాలి


మాట్లాడుతున్న పద్మశాలి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు అంజనేయులు

కోసిగి: పద్మశాలి కులబాంధవులు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని పద్మశాలి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వై.అంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం కోసిగి శ్రీ మార్కండేయ స్వామి ఆలయ కళ్యాణ మండపంలో మండల స్థాయి పద్మశాలి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామిని ప్రతి సోమవారం దర్శించుకుని పూజలు చేసుకుంటే మంచి జరుగుతుందన్నారు. ఆలయం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఆలయ ఆర్థిక లావాదేవీలు చర్చించి అభివృద్ధి పనులు చేసేవిధంగా ప్రణాళిక రూపొందించారు. త్వరలో భక్తుల సహకారంతో ఆలయ గోపుర పునఃనిర్మాణం చేసేందుకు తీర్మానించారు. సంఘం కార్యదర్శి జేరుబండి నరసింహులు, కేతారి వెంకటేష్, కులబాంధవులు పాల్గొన్నారు.


అడవి అందాల మాలిక చిత్రం


తామర పూలతో నిండిన సెలయేరు, వంతెన చిత్రం


పద్మనాభ తీర్థ అతిథిగృహం ప్రహరీపై పల్లె చిత్రాలు

## చిత్రం.. నయనానందకరం

సెలయేటి గలగలలు.. పక్షుల కిలకిల రావాలు.. పరిఢవిల్లే పచ్చదనం.. పొలం పనుల్లో పల్లెజనం.. ప్రకృతి సోయగాలకు కేరాఫ్. పల్లె, ప్రకృతి పట్నం నడిచొచ్చినట్టు కళాఖండాలు శ్రీమఠంలో ఆకట్టుకుంటున్నాయి. భక్తులకు ప్రకృతి, పల్లె అందాలతో తియ్యని అనుభూతిని పంచుతున్నాయి. ప్రముఖ రాఘవేంద్రస్వామి మఠం, వసతి నిలయాల ప్రహరీలు, గోడలపై గీసిన చిత్రాలు మనసులను దోచుకుంటున్నాయి. అన్నపూర్ణ భోజనశాల, ఎస్‌వీబీ, పద్మనాభతీర్థ, దక్షిణ భాగంలోని శ్రీమఠం ప్రహరీలపై వన్యప్రాణులు, పల్లె అందాలు, ప్రకృతి సోయగాల చిత్రాలు చిత్రీకరించారు. ఈ సుందర దృశ్యాలు భక్తజన కోటికి నయనానందం పంచుతున్నాయి. – మంత్రాలయం


పచ్చని పొలం పనుల్లో భార్యభర్తల చిత్రం


అనురాగాల అమ్మతో చిన్నారి చిత్రం


జాతీయ పక్షి నెమలి చిత్రం